
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



సరస్వతీదేవికి స్వర్ణపుష్ప పూజ

తెనాలి టౌన్: స్థానిక వి-ఫర్నిచర్ మాల్‌లో గురువారం సరస్వతీదేవికి స్వర్ణపుష్ప పూజలు నిర్వహించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి బాలస్వామిజీ పాల్గొన్నారు.



నిండు కుండలా పులిచింతల

అచ్చంపేట: ఎగువ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 4,28,115 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4,32,175 క్యూసెక్కులు వదులుతున్నారు.



ఉచిత ప్రసాద వితరణకు విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఉచిత ప్రసాద వితరణ పథకానికి గుంటూరు రెడ్డిపాలెంకు చెందిన తిరుమలశెట్టి భార్గవ తేజ రూ. 1,00,116 విరాళం ఇచ్చారు.

న్యూస్‌రీల్

నేడు సామూహిక వరలక్ష్మి వ్రతం



మంగళగిరి: మంగళాద్రిలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం సామూహిక శ్రావణలక్ష్మి పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం ఆలయ ఈవో సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి తిరువంజనం, 9 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు స్వామి వారి వస్త్రాలు వేలం

శ్రీ లక్ష్మీనృసింహస్వామి, ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలను శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు దిగువ సన్నిధిలోని ఆలయ ఆవరణలో వేలం పాట ఉంటుందని ఈవో తెలిపారు.

హక్కుల పరిరక్షణపై సదస్సు

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు క్యాలెండరు యాక్టివిటీస్‌లో భాగంగా గురువారం గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పౌర హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. సచివాలయంలోని మహిళా పోలీసులకు దీనిపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం అంటరానితనం నిషేధం అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు గౌరవ, సమాన హక్కులను కల్పిస్తుందని పేర్కొన్నారు.

అటవీ సిబ్బంది నిరసన




నరసరావుపేట రూరల్: అటవీ శాఖ సిబ్బందిపై టీడీపీ ఎమ్మెల్యే దాడికి నిరసనగా పల్నాడు డివిజన్ సిబ్బంది గురువారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈనెల 19వ తేదీ రాత్రి శ్రీశైలం శిఖరం చెక్‌పోస్ట్ వద్ద టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి విధుల్లో ఉన్న అటవీశాఖ సిబ్బందిపై దాడి చేశారు. దీనిని తీవ్రంగా ఖండించిన డివిజన్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఎమ్మెల్యేను, ఆయన అనుచరులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ డి.వి. రమణ, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అమీర్ జానీ బాషా, డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చి జంతువుల వేట



బెల్లంకొండ: అటవీ ప్రాంతంలో విద్యుత్తు లైన్‌కు ఇనుప తీగలు అమర్చి జంతువులను వేటాడటాన్ని సిబ్బంది అడ్డుకున్నారు. మండలంలోని వెంకటాయపాలెం అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి విద్యుత్ లైన్‌కు కనెక్షన్ ఇచ్చి జంతువులను వేటాడేందుకు వేటగాళ్లు తీగలను అమర్చారు. గమనించిన విద్యుత్ సిబ్బంది అక్కడకు వెళ్లగా పరారయ్యారు. వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని సబ్ స్టేషన్ తరలించారు. వేటగాళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఏఈ పవన్ కుమార్ తెలిపారు.

'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' ఫ్లెక్సీ తొలగింపు



భట్టిప్రోలు(వేమూరు): మండలంలో చింతమోటులో ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ ఫ్లెక్సీలు తొలగించేందుకు అధికారులు సిద్ధం కాగా గ్రామస్తులు అడ్డుకున్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు వచ్చి.. అనుమతి లేని ఫ్లెక్సీలన్నీ తొలగించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఫ్లెక్సీ తొలగించారు.

దోపిడీకి కాదేదీ అనర్హం అనేలా తెలుగు తమ్ముళ్లు నగరపాలక సంస్థలో ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం మాది... పనులు కూడా మాకే దక్కాలి.... వేరే ఎవరికీ కేటాయించడానికి వీలు లేదంటూ బహిరంగంగానే రెచ్చిపోతున్నారు. ఇటీవల 269 వర్కులలో లాభాలు వచ్చే వాటిని తామే చేసుకుంటామని, టెండర్లలో పాల్గొనవద్దని తోటి కాంట్రాక్టర్లను బహిరంగంగానే బెదిరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వారి దోపిడీ మరోస్థాయికి చేరింది.



రూ.కోట్లలో తమ్ముళ్ల లూటీ!

మున్సిపల్ అధికారుల అండతో పనుల్లో అడ్డగోలుగా దోపిడీ

- టెండర్లలో పాల్గొన్నట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన నేతలు
- తమకు నచ్చిన వర్కును బ్లాక్ చేసి మరీ మోసం
- అడ్డదారిలో సొంతం చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు
- అన్నివిధాలా సహకరిస్తున్న జీఎంసీ అధికారులు
- 67 వర్కుల వరకు ఇదే రీతిలో కట్టబెట్టిన యంత్రాంగం
- ఇప్పటికే బిల్లులు కూడా ప్రాసెస్ చేసినట్లు ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : గుంటూరు నగరంలో ఏ అభివృద్ధి పనైనా టెండర్ ద్వారా నిర్వహించాల్సి ఉంటుంది. దేశ వ్యాప్తంగా ఎక్కడి నుంచైనా, ఎవరైనా టెండరు వేయవచ్చు. తెలుగు తమ్ముళ్లు ఈ ప్రక్రియకు ఫుల్‌స్టాప్ పెట్టారు. వర్కులో బాగా మిగులుతుందని భావిస్తే చాలు టెండరింగ్ (ఈ-ప్రొక్యూర్‌మెంట్) ప్రక్రియలో పెట్టకుండా.. టెండర్ పాల్గొన్నట్లుగా నకిలీ డాక్యుమెంట్లు పుట్టిస్తున్నారు. దానికి నగర పాలక కమిషనర్ నుంచి ఆమోదం పొంది, వర్క్ ఆర్డర్ తీసుకుంటున్నట్లు సమాచారం. అంతేకాకుండా.. ఈ పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు కూడా చకాచకా ప్రాసెస్ చేసినట్లు తెలుస్తోంది. వీటన్నింటికీ అధికారుల అండదండలు ఉన్నందునే తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారని తోటి కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.

'లెస్సు'లో మాయాజాలం

గుంటూరు నగరపాలక సంస్థలో ఏ వర్కు తీసుకున్నా అది రూ.50 లక్షల నుంచి రూ.కోటిపైనే ఉంటుంది. ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు నిర్వహించినప్పుడు సదరు వర్కులో లెస్‌కు పాడుకుని కొంతమంది వర్కులు చేస్తుంటారు. ఉదాహరణకు రూ.కోటి విలువైన ఒక పనికి టెండరు పిలిస్తే 20 శాతం లెస్‌కు ఎవరైనా వేస్తే రూ.80 లక్షలతో ఆ పని చేయాలి. కానీ ఇక్కడ విడ్డూరం ఏమిటంటే కావాలనే టెండర్ల ప్రక్రియలో ఎవరూ పాల్గొనకుండా చేసి, తమకు అనుకూలురైన టీడీపీ నేతలతో 20 శాతం లెస్ వేసినట్లు చూపిస్తారు. తరువాత అధికారులకు మామూళ్లను సమర్పించుకుంటున్నారు. ఇక అసలు పని అప్పుడు ప్రారంభం అవుతుంది. ఫైల్ ప్రాసెస్ చేసే సమయంలో 20 శాతం లెస్‌ను కాస్త 2.0 శాతంగా మార్చిస్తున్నారు. టెండర్ డాక్యుమెంట్‌లో మాత్రం 20 శాతం లెస్ వేసినట్లుగానే ఉంటుంది. అంటే రూ.20 లక్షలు తక్కువగా చూపించాల్సిన వర్కును రూ.రెండు లక్షలకు తగ్గించి చూపించి రూ.కోట్లు దండుకుంటున్నారు. ఇదే తంతు 2014–19 మధ్య కూడా జరిగిందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. దీని వలన కార్పొరేషన్‌కు రూ.10 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని సమాచారం.

రిజిస్ట్రేషన్ గడువు పూర్తయినా...

ఏదైనా టెండర్ ప్రక్రియలో పాల్గొనాలంటే ప్రతి కాంట్రాక్టర్ తప్పనిసరిగా పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ, పంచాయతీరాజ్ ఎస్‌ఈ, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ, ఇంజినీరింగ్ అండ్ చీఫ్ నుంచి ఐదేళ్ల కాలపరిమితితో కాంట్రాక్ట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. అప్పుడే వర్కు చేసుకోవాల్సి ఉంటుంది. నగరంలో ఓ కాంట్రాక్టర్‌కు రిజిస్ట్రేషన్ కాలపరిమితి పూర్తయి ఏళ్లు గడుస్తున్నప్పటికీ పాత సర్టిఫికెట్‌ను ట్యాంపరింగ్ చేసి వర్కుల్లో పాల్గొంటూ, బిల్లులు కూడా చేసుకుంటున్నారు. కొందరు దీనిపై ఫిర్యాదు చేయగా సదరు కాంట్రాక్టర్ చూపిన సర్టిఫికెట్‌లు ఆయా శాఖలకు చేరాయి. వాటిని తాము ఇవ్వలేదని పై అధికారుల నుంచి సమాధానం వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజినీరింగ్ విభాగంలో అక్రమార్కులు కొత్త దందాలకు పాల్పడుతున్నారు.

చిన బాబుపై

చిన్న చూపు..!

ఏఎన్‌యూలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు ఎనలేని ప్రాధాన్యం

విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు సొంత నియోజకవర్గంలోనే దక్కని గౌరవం
- ఆహ్వాన పత్రికలోనూ ఎక్కడో మూలన కేంద్ర, రాష్ట్ర అమాత్యుల పేర్లు
- మంత్రులూ ఎమ్మెల్యే కంటే తక్కువే అనేలా కొందరి తీరు

పెదకాకాని(ఏఎన్‌యూ): విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు సొంత నియోజకవర్గంలోనే కనీస గౌరవం దక్కడం లేదు. కూటమి ప్రభుత్వంలో 'అన్నీ తానై' నడిపిస్తున్న చినబాబును ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో చిన్నచూపు చూస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల సేవలో తరిస్తున్నారు. ఓ ఆహ్వానపత్రికలో ఎమ్మెల్యే పేరు పక్కన అచ్చేయడానికి కేంద్ర సహాయ మంత్రి, రాష్ట్ర మంత్రి పేర్లు నోచుకోలేదు. వర్సిటీకి ఎమ్మెల్యేనే బాస్ అని, ఆయన్ను ప్రసన్నం చేసుకుంటే అన్ని పనులు అవుతాయని వర్సిటీలోని కొందరు అతిగా వ్యవహరిస్తున్నారు.

ఆహ్వానపత్రికలో ఎమ్మెల్యేకు ప్రాధాన్యం

వర్సిటీ యంత్రాంగం ఎమ్మెల్యే భజనలో ఉన్నారనే వాస్తవం గతంలో పలు పరిణామాలు స్పష్టం చేశాయి. గురువారం వర్సిటీలో చేపట్టనున్న రూసా హబ్ సెంటర్ బిల్డింగ్‌కు భూమిపూజ కార్యక్రమం కోసం ముద్రించిన ఆహ్వాన పత్రికతో అది మరోసారి బట్టబయలైంది. పూజను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చేస్తారంటూ ముద్రించారు. కింది వరుసలో గౌరవ అతిథులుగా హాజరవుతున్నారంటూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఉన్నత విద్యాశాఖమంత్రి నారా లోకేష్ పేర్లు చిన్న అక్షరాలతో ప్రచురించారు. ప్రొటోకాల్ ప్రకారమే పేర్లు వేయించామని అధికారులు చెబుతున్నా.. కేంద్ర, రాష్ట్ర మంత్రుల పేర్లు ముందు వరుసలో ఉండాల్సిందేనని నిబంధనలు సైతం స్పష్టం చేస్తున్నాయి. టీడీపీకి చెందిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం తదితరుల పేర్లు కూడా ఏమయ్యాయనే ప్రశ్నలకు అధికారులే సమాధానం చెప్పాలి. మరోవైపు ఈ పూజ వాయిదా పడింది.

లోకేష్ ఊసే లేదు...

ఏకంగా నారా లోకేష్‌కు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో ఉన్న ఏఎన్‌యూలో కనీస గౌరవం కూడా దక్కడం లేదని తేలింది. కూటమి ప్రభుత్వంలో ఇన్‌చార్జి పాలకులు, ఉన్నతాధికారుల పదవులన్నీ ధూళిపాళ్ళ నరేంద్ర ఓకే అన్న వారికే దక్కాయని, యూనివర్సిటీ వ్యవహారాల్లో ఎమ్మెల్యే తప్ప మరొకరు జోక్యం చేసుకునే వీలు లేదనే ప్రచారం సాగుతోంది. వాస్తవానికి వర్సిటీలో ప్రధాన ద్వారం నుంచి కాజ టోల్‌గేట్ వైపు ఉన్న ప్రాంతమంతా మంగళగిరి నియోజకవర్గంలోనిది. ప్రధాన ద్వారం నుంచి పెదకాకాని వైపున్న ప్రాంతం పొన్నూరు నియోజకవర్గ పరిధిలో వస్తుంది. వర్సిటీ సగం ప్రాంతం మంత్రి లోకేష్ నియోజకవర్గంలో ఉంది. వర్సిటీ ఏర్పడినప్పటి నుంచి రెండు ప్రాంతాల ఎమ్మెల్యేలకు సమ ప్రాధాన్యం దక్కేది. కూటమి ప్రభుత్వం వచ్చాక లోకేష్ ఊసే లేదు. త్వరలో జరగబోయే రెగ్యులర్ వీసీ, ఆ తరువాత భర్తీ అయ్యే ఇతర పదవులలో కూడా మంత్రి ప్ర మేయం ఉండదని కూడా కొందరు షాడోలు చెప్పుకొస్తున్నారు. ఏఎన్‌యూలో పరిణామాలు, షాడో వ్యవహారాలు మంత్రికి తెలియకుండా మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వర్సిటీలో రాజకీయాలకు, నాయకుల విగ్రహాలకు చోటు ఉండకూడదని నిర్ణయించారు. కానీ వర్సిటీ పాలకులు, అధికారులు సాక్షాత్తూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని కూల్చివేశారు. గురువారం వర్సిటీలోని ప్రధాన రోడ్లన్నీ ఎమ్మెల్యే, అధికారుల ఫొటోలున్న ఫ్లెక్సీలతో నిండిపోవడం గమనార్హం.

డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు 26 వరకు గడువు



గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ మొదలైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రారంభించింది. ఈ నెల 26వ తేదీ వరకు అవకాశం దీనికి కల్పించింది. నూతన జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా సమూల మార్పులతో డిగ్రీ కోర్సులను తీర్చిదిద్దిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఆన్‌లైన్ అడ్మిషన్స్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఏఎండీసీ) విధానంలోనే 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. విద్యార్థులు అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలను హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లోనే పరిశీలన చేస్తారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ల నమోదు, సీట్ల కేటాయింపు, కళాశాలలో చేరికలు వరుస క్రమంలో జరగనున్నాయి.

24 నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు, బాపట్లలోని మహిళా కళాశాలలు, చేబ్రోలు, రేపల్లె, వినుకొండ, మాచర్లలోని కో-ఎడ్యుకేషన్ కళాశాలలతో పాటు 70 ప్రైవేటు, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు జరుగుతున్నాయి. విద్యార్థులు ఇంటర్నెట్ కేంద్రాలతో పాటు డిగ్రీ కళాశాలల నుంచి ఆన్‌లైన్‌లో సెట్స్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రాసెసింగ్ ఫీజు రూపంలో ఓసీ విద్యార్థులు రూ.400, బీసీ రూ.300, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.200 చొప్పున చెల్లించాలి. అన్ని ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన విద్యార్థులు వాటి పరిశీలనకు హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఆప్షన్లు మార్చుకునేందుకు 29న తుది అవకాశం ఉంటుంది. 31న సీట్ల కేటాయించాక సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

జెడ్పీ చైర్‌పర్సన్ ఎక్కడ?

- గత నెలలోనే విదేశీ పర్యటనకు హెనీ క్రిస్టినా
- 5 నుంచి వెళ్లినట్లుగా అధికారికంగా సమాచారం
- వైస్ చైర్మన్‌కు బాధ్యతల అప్పగింతలో కనీస నిబంధనలు పాటించని వైనం



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్‌లో నెలకొన్న పరిణామాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన చైర్‌పర్సన్ నాలుగు వారాలుగా వ్యక్తిగత పనులపై విదేశాల్లో ఉన్నారు. 15 రోజులకు పైబడి అందుబాటులో లేకుంటే, వైస్ చైర్మన్‌కు బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వ నిబంధనలు స్పష్టంగా చెబుతున్నప్పటికీ ఖాతరు చేయడం లేదు.

పాలనపై అంతులేని నిర్లక్ష్యం

గత నెల 26వ తేదీ నుంచి చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అందుబాటులో లేరు. వ్యక్తిగత పనులపై అమెరికా వెళ్లారు. దీనిపై అధికారికంగా సమాచారం పంపలేదు. ఈ నెల 5 నుంచి 16వ తేదీ వరకు వ్యక్తిగత పనులపై విదేశాలకు వెళుతున్నట్లు అధికారికంగా సమాచారం పంపారు. వాస్తవానికి 15 రోజులకుపైగా అందుబాటులో లేకుంటే, వైస్ చైర్మన్‌కు బాధ్యతలు అప్పగించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కానీ నాలుగు వారాలుగా అందుబాటులో లేకుండా దేశం దాటి వెళ్లినప్పటికీ, ప్రభుత్వంతోపాటు ఉన్నతాధికారులు సైతం మిన్నకుండిపోయారు. జెడ్పీలో పరిపాలనకు ఆటంకం కలుగకుండా చూడాల్సిన ప్రభుత్వం, యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై జెడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జెడ్పీలో జరుగుతున్న వ్యవహారంపై జిల్లా అధికార యంత్రాగం సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పరిపాలనలో నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అదే విధంగా తెనాలి జిల్లా కోర్టులో విచారణలో ఉన్న ఓ కేసులో వాయిదాలకు గైర్హాజరవుతున్న కత్తెర హెనీ క్రిస్టినా.. తాము విదేశాల్లో ఉన్నామంటూ కోర్టుకు సమాధానం పంపుతున్నారని తెలిసింది.

'అంధ'ంగా ఆడినా అదే వేదన

- అంధుల క్రికెట్‌కు ప్రోత్సాహం నామమాత్రం
- పదేళ్లుగా జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న జట్టు
- భారత జట్టుకు కూడా రాష్ట్రం నుంచే కెప్టెన్
- ప్రైవేటు సంస్థలు కనికరిస్తేనే మ్యాచ్‌లు
- ప్రభుత్వం ఆదుకోవాలని అంధ క్రికెటర్లు వినతి



గుంటూరులోని పిచ్చుకలగుంట మైదానంలో క్రికెట్ ఆడుతున్న అంధ క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఒకవైపు అంధత్వం, మరోవైపు పేదరికం... సమాజంలోనూ చిన్నచూపు.. ఇన్ని ఆటంకాలను ఎదుర్కొంటూ క్రికెట్‌లో రాణిస్తున్నారు కొందరు అంధులు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారిని ప్రోత్సహించడంలో ప్రభుత్వం నుంచి స్పందన కనిపించడం లేదు. కొన్ని ప్రైవేటు సంస్థల దాతృత్వంతోనే అంధుల క్రికెట్ పోటీలు రాష్ట్రంలో జరుగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. స్థానిక అరండల్‌పేటలోని ఏసీఏ క్రీడా మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఏపీ, విజువల్లీ బ్లైండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, డిఫరెంట్ డిసేబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సంయుక్తాధ్వర్యంలో అంధుల క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. మొత్తం 42 మంది 3 జట్లుగా మ్యాచ్‌లు ఆడుతున్నారు. ప్రతిభ చాటిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నారు. వీరికి మాజీ భారత అంతర్జాతీయ బ్లైండ్ క్రికెటర్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి సాయం చేసి, మెంటార్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. వారికి ప్రతిభ చాటే అవకాశం కల్పించారు.

దేశంలో మనమే టాప్

గత పదేళ్లుగా జాతీయ క్రికెట్‌లో రాష్ట్ర జట్టు ప్రథమ స్థానంలో నిలుస్తోంది. భారత జట్టుకు కూడా మన రాష్ట్రం నుంచే కెప్టెన్‌గా ఎంపికవుతూ వస్తున్నారు. ప్రభుత్వాలు మాత్రం వీరిని కనీసం పట్టించుకోవడం లేదు. అంధ క్రికెటర్లు మైదానంలో ప్రతిభ కనబరుస్తున్నారు. వీరి కోసం నిధుల కేటాయింపు కూడా లేదు. గురువారం మ్యాచ్‌లను చూసేందుకు వచ్చిన సంబంధిత శాఖ చైర్మన్ జి.నారాయణ స్వామి మాట్లాడుతూ అంధ క్రికెటర్ల అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

క్రికెట్‌కే జీవితం అంకితం



నేను భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించా. నా జీవితం క్రికెట్‌కే అంకితం. రాష్ట్రం నుంచి గత పదేళ్లలో ఏడుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఆడారు. ఎన్నో ప్రతికూల పరిస్థితుల్లో ఇంత మంది దేశానికి ఆడితే... ప్రభుత్వం సాయం అందిస్తే చాలామంది ఆడతారు. ప్రస్తుతం రాష్ట్రంలో 150 మంది వరకు ఆడుతున్నారు. వీరి సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నా. కొందరు సాయం అందిస్తున్నారు. ప్రభుత్వం స్పందిస్తే బాగుంటుంది.

– ఐ.అజయ్ కుమార్ రెడ్డి, అంధ క్రికెటర్ల మెంటార్

ఇబ్బందులు ఉన్నా ఆడతా



నేను పదేళ్ల నుంచి జాతీయ జట్టుకు ఆడుతున్నాను. మాది చాలా పేద కుటుంబం. 11 ఏళ్ళ వయస్సులో కంటిచూపు శాశ్వతంగా కోల్పోయాను. అయినా క్రికెట్ మానలేదు. కిట్ కొనడానికి, ప్రయాణానికీ సమస్యలే. కొందరు దాతల సాయంతో నెట్టుకొస్తున్నా. త్వరలోనే భారత జట్టుకు ఆడతా.

– పాతలింగ, అనంతపురం

ఎందుకంత వివక్ష?



మాకు చూపు లేదు. ఆర్థిక కష్టాలు చెప్పనలవి కాదు. ఇన్ని ఇబ్బందుల మధ్య ఆడుతున్నాం. ప్రభుత్వాలకు మేమంటే ఎందుకంత వివక్షో అర్థం కాదు. ప్రతి ఒక్కరూ సాయం చేస్తామంటారు. అక్కడి వరకు వచ్చేసరికి ముఖ చాటేస్తున్నారు. 4 సార్లు నేషనల్స్‌లో ఆడాను. ఆదుకోండి. ఆడుకుంటాం.

– ఎ.లోకేష్, కడప

స్పాన్సర్లకు ధన్యవాదాలు



ప్రస్తుతం మ్యాచ్‌లు ఆడటానికి ఐటీసీ, ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ నిర్వహకులు స్పాన్సర్‌షిప్ అందిస్తున్నారు. దాతలు ముందుకొస్తేనే మా ఆట కొనసాగుతోంది. ప్రభుత్వం ఆలోచించాలి. ప్రస్తుతం స్టేట్ క్రికెటర్‌గా కొనసాగుతున్నా. అజయ్ కుమార్ రెడ్డి మెంటార్‌గా ప్రోత్సహిస్తున్నారు.

– టి.శివయ్య, తిరుపతి

ఓట్ల తొలగింపు అన్యాయం

దాచేపల్లి : త్వరలో జరగనున్న ఉప ఎన్నికలో కూటమి అభ్యర్థి గెలుపు కోసమే వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని మూడో వార్డుకు త్వరలో ఉప ఎన్నికలు జరగనున్నాయి. గత ఓటరు జాబితాలో 1,596 ఓట్లు ఉన్నాయి. తాజాగా అధికారులు తయారు చేసిన జాబితాలో 1,112 ఓట్లు మాత్రమే ఉన్నాయి. తాజాగా వెలువరించిన జాబితాలో 484 ఓట్లు మాయం అయ్యాయి. వీటిల్లో అత్యధికంగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఓట్లే ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నేతలు గురువారం నగర పంచాయతీ కమిషనర్ జి. వెంకటేశ్వర్లు కలిసి వినతిపత్రం అందించారు. ఓటర్ల మాయంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నేతలు కోరారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,500 గరిష్ఠం : రూ. 3,700

మోడల్ ధర రూ. 3,000



పసుపు ధరలు

(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 483

కొమ్ములు : 271 బస్తాలు	(ధర రూ॥ల్లో)	
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,200	10,700	10,600

కాయలు : 212 బస్తాలు		
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,900	10,700	10,200

మొత్తం అమ్మకాలు : 362.250 క్వింటాళ్లు

–దుగ్గిరాల

దివ్యాంగులకు 'సదా'రం కష్టాలు

- ప్రణాళిక లేకుండా పంపుతున్న సచివాలయ ఉద్యోగులు
- జాబితాలో పేర్లు లేకపోవటంతో వెనక్కి వెళ్లాలంటున్న వైద్యులు
- కూటమి ప్రభుత్వ తీరుపై ఆందోళనకు దిగిన బాధితులు



తెనాలిలోని జిల్లా వైద్యశాల వద్ద ఆందోళన నిర్వహిస్తున్న దివ్యాంగులు

తెనాలి అర్బన్: కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు దివ్యాంగుల పాలిట శాపంగా మారుతున్నాయి. రీ వెరిఫికేషన్‌కు హాజరుకాని వారిని గుర్తించి తెనాలి జిల్లా వైద్యశాలకు సచివాలయ ఉద్యోగులు పంపుతున్నారు. అయితే గురువారం లిస్ట్‌లో ఉన్న వారిని కాకుండా అదనంగా 40 మంది దివ్యాంగులను వారు ఇక్కడకు పంపారు. దీంతో గందరగోళం నెలకొంది. సాయంత్రం వరకు వేచి ఉన్నప్పటికీ వైద్యులు మాత్రం వారికి పరీక్షలు చేలేదు. దీంతో సూపరింటెండెంట్ ముందు బాధితులు నిరసన తెలిపారు.

చుక్కలు చూపెడుతున్న సర్కార్ తీరు

దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం పింఛన్ పంపిణీ చేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత లబ్ధిదారుల్లో చాలామందికి పింఛన్‌లు ఎగ్గొట్టాలనే ఉద్దేశంతో కొన్ని నెలల క్రితం రీ వెరిఫికేషన్ చేయించేందుకు తెనాలి జిల్లా వైద్యశాలకు తెనాలి, వేమూరు, మంగళగిరి, రేపల్లె నియోజకవర్గాలకు చెందిన దివ్యాంగులను పంపారు. ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, జనరల్ మెడిసిన్, సైక్రియాటిక్ విభాగాలకు చెందిన వైద్యులు వీరికి పరీక్షలు చేసి సదరం సర్టిఫికెట్‌లు ఇచ్చారు. ఆ సమయంలో క్యాంప్‌నకు హాజరు కాని వారు బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎక్కువ మంది ఉన్నారు. వారిని గురువారం తెనాలి పంపారు.

అసలు లెక్కే లేదు..

వేమూరు, బాపట్ల నియోజకవర్గాల పరిధిలోని దివ్యాంగులు పెద్ద సంఖ్యలో గురువారం తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలోని డైక్ సెంటర్‌కు వచ్చారు. చీరాల నుంచి వచ్చిన ఈఎన్‌టీ వైద్యురాలు, నర్సారావుపేట నుంచి వచ్చిన సైక్రియాటిక్ వైద్యులు పరీక్షలు చేసేందుకు ఇక్కడికి వచ్చారు. అధికారులు ఇచ్చిన జాబితాతో ఉన్న వారికి మాత్రమే పరీక్షలు చేశారు. మిగిలిన వారు ఉదయం నుంచి సాయంత్రం అయిన వేచి చూసినా పరీక్షలు చేయకపోటంతో ఆందోళనకు దిగారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణిని కలసి తమ ఆవేదన తెలియజేశారు. కేవలం 25 నుంచి 30 మంది వరకే రోజుకు పరీక్షలు చేసే అవకాశం ఉందని, ఎక్కువ మందిని పంపటం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆమె గుర్తించారు. వెంటనే బాపట్ల డీఆర్‌డీఏ పీడీతో మాట్లాడి ఇలా ఎక్కువ మందిని పంపొద్దని కోరారు. గురువారం అదనంగా వచ్చిన 40 మందిని రోజుకు 10 మందికి పరీక్షలు చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు దివ్యాంగులకు తెలియజేయడంతో వారు శాంతించారు.

పింఛన్లు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం



మాట్లాడుతున్న ఆగస్టీన్

- రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దుర్మార్గం
- వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ఆగస్టీన్

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త పింఛన్లు ఇవ్వకపోగా... ఉన్న దివ్యాంగ పింఛన్లను రీ వెరిఫికేషన్ పేరుతో తొలగించడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు బోక్క ఆగస్టీన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో దివ్యాంగ విభాగం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి తర్వాత రాష్ట్ర ప్రజలను ఎన్నో రకాలుగా ఇబ్బందులు గురిచేస్తోందన్నారు. ఎన్నికల హామీలో మాత్రం రూ.6 వేలు పింఛను ఇస్తామని చెబితే సంబరపడ్డామని.. ఇప్పుడు నిర్దయగా తీసేస్తున్నారని మండిపడ్డారు. గతంలో 80 శాతం వైకల్యం ఉంటే ఇప్పుడు 40 శాతం ఉన్నట్లు చూపించి పింఛన్లు తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన వారికి కూడా మొండి చేయి చూపడం ఎంతవరకు సమంజసం అన్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో ఆసుపత్రులకు, ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీని వల్ల దివ్యాంగులు కార్యాలయాల మెట్లు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

నాడు అండగా వైఎస్ జగన్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దివ్యాంగులకు అండగా నిలిచారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి తమ కష్టాలను తీర్చారని దివ్యాంగులు పేర్కొన్నారు. ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ తీసేయడంతో ఏ పని కావాలన్నా కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వారి కోసం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులతో కలిసి నిరసన చేపడతామన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన విధంగానే దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దాసరి గణేష్ బాబు, కొమ్మా లింగరావు, శంకర్, జె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తెనాలిటౌన్: అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి మాట్లాడుతూ ఈకేవైసీ, ఫేస్ రికగ్నేజేషన్ తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన వలన లబ్ధిదారులకు సకాలంలో ఫీడింగ్ ఇవ్వలేకపోతున్నట్లు ఆరోపించారు. 10 ఏళ్ల క్రితం ఇచ్చిన స్మార్ట్ ఫోన్ల వలన నెట్‌వర్క్ సరిగా పనిచేయక లబ్ధిదారులు ఒకటికి మూడు సార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులు తమపై అసహనం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో లబ్ధిదారులకు ఫీడింగ్ ఇవ్వడం కష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం సీడీపీవో విజయగౌరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్ వలి, కె.రంగపుష్ప, రాధిక, రాజకుమారి, రామలక్ష్మి, రాహెలమ్మ, ఎస్‌కే ముని, వహీదా, సీహెచ్ శివకుమారి, కె.మాధవి, డి.కళ్యాణి, ఎం.సుజాత, వై.నాగమల్లేశ్వరి, కె.లక్ష్మి , బుల్లెమ్మ, ఎలిజిబెత్ రాణి, రమాదేవి, త్రివేణి, అలిషా బేగం, జ్యోతి, సునీత, రజియా తదితరులు ఉన్నారు.

28న విద్యుత్ పోరాట ప్రతిజ్ఞ దినం

లక్ష్మీపురం: ఈ నెల 28వ తేదీన విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినాన్ని విద్యుత్ పోరాట ప్రతిజ్ఞ దినంగా జరుపుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజానీకంపై భారీ ఎత్తున విద్యుత్ భారాలు మోపిందని, అప్పట్లో వామపక్ష పార్టీల నాయకత్వంలో రాష్ట్రవ్యాప్త ప్రజా ఉద్యమం జరిగిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వస్తే విద్యుత్తు చార్జీలు పెంచబోమని, భారం తగ్గిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కానీ అదనపు భారాలను ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతోను, ట్రూఅప్ చార్జీల పేరుతో మోపిందన్నారు. దీంతోపాటు స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా వేదిక ఆధ్వర్యంలో ప్రతిఘటన ఉద్యమం సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రజానీకం ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ నెల 28వ తేదీన జరిగే ప్రతిజ్ఞ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామ పక్ష, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

25న రజకుల ధర్నాను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: కూటమి నేతలు ఇచ్చిన ఎన్నికల హామీల అమలు కోసం ఈ నెల 25వ తేదీన గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు మందూరు వెంకట నరసయ్య గురువారం పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమ ప్రచార కరపత్రాలను సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. హామీల అమలలో ప్రభుత్వం చిత్తశుద్ధిగా పనిచేయడం లేదని, మంత్రులతో కూడిన సబ్ కమిటీ ఏర్పాటు చేసి కాలయాపన చేస్తోందన్నారు. సమావేశంలో సంఘ జిల్లా కోశాధికారి వెంపాటి చిన్న కొండయ్య, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవికుమార్

మర్రిపాలెం (విశాఖ జిల్లా): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఊహించని మలుపు చోటు చేసుకుంది. ప్రమాదానికి కారణమైన కారులో గంజాయిని గుర్తించిన పోలీసులు, ఆ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్ వెల్లడించారు. ఈ నెల 12న సుభాష్‌నగర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఒక కారు ఢీకొని ఏడాదిన్నర చిన్నారి వర్షిత్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటన తర్వాత కారు డ్రైవర్, తమిళనాడుకు చెందిన అర్జునన్ జెమినీ ఆర్ముగంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం జరిగినప్పుడు కారులో ఉన్న మరో ముగ్గురు పరారయ్యారు. పోలీసులు ఈ నెల 16న సీజ్ చేసిన కారును తనిఖీ చేయగా.. 21 కిలోల గంజాయిని గుర్తించారు. పరారీలో ఉన్న ముగ్గురినీ అరెస్ట్ చేశారు. వారిని హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటున్న గుంటూరుకు చెందిన అక్షయ గౌతమి(20), షేక్ మహమ్మద్ జాకీర్ (19), ఒంగోలుకు చెందిన పెర్లి విజయవర్ధన్ రాజు (25)గా గుర్తించినట్లు సీఐ తెలిపారు. వీరు విజయవాడలో కారు అద్దెకు తీసుకుని అరకు వెళ్లి గంజాయి కొనుగోలు చేశారు. తిరిగి వస్తుండగా ఊర్వశి జంక్షన్ సమీపంలోని సుభాష్‌నగర్ వద్ద ప్రమాదం జరిగింది. పెర్లి విజయవర్ధన్ రాజుపై ఇప్పటికే ఒంగోలులో 11 కేసులు ఉన్నాయని, మహమ్మద్ జాకీర్‌పై కూడా గంజాయి కేసు ఉందని పోలీసులు వెల్లడించారు. యువతికి తల్లిదండ్రులు లేరు. విజయవర్ధన్‌కు బంధువు కావడంతో అతనితో ఇలా వెళ్తూ ఉంటుందని పోలీసులు చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపించిన ఎస్‌ఐలు షేక్ సమీర్, రవికుమార్‌లను సీఐ అభినందించారు.

23న విద్యారంగ సమస్యల పరిష్కారానికి ధర్నా

లక్ష్మీపురం: జీవో నంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయంబర్స్‌మెంట్ అందించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నా పోస్టర్‌ను గురువారం గుంటూరు బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లులు పెంచాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, హాస్టల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు సౌమ్య, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై 'అవుట్ సోర్సింగ్' వారి పెత్తనమా?

ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్

నెహ్రూనగర్: రాష్ట్రంలోని సచివాలయ వ్యవస్థపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కోసం మూడు అంచెలుగా మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి వ్యవస్థను ప్రభుత్వం తీసుకురాబోతుందని, అందులో భాగంగా గ్రామ వార్డు సచివాలయాలను పర్యవేక్షించే మండల, జిల్లా స్థాయి కార్యాలయాల్లో పనిచేయడానికి 1,785 మంది సిబ్బందిని డిప్యూటేషన్/ అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించడానికి కేబినేట్ ఆమోదించడం అనాలోచిత చర్య అని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ఆరు సంవత్సరాల నుంచి గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలనే కనీస ఆలోచన లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోగా కొత్త సమస్యలను సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులైన వారిని పర్యవేక్షించడానికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. అర్హులైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకే పదోన్నతులు కల్పించి మండల, జిల్లా స్థాయి సచివాలయ ప్రధాన కార్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఆరు సంవత్సరాలుగా వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శుల నుంచి ఎడ్యుకేషన్ అనే విభాగాన్ని తొలగించి ఇతర ఉద్యోగులకు కేటాయించాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని, ఈ నిర్ణయం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందన్నారు.

మిర్చి యార్డు సమాచారం

(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	49,031
అమ్మకాలు	47,852
నిల్వ	2,391

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,700
నంబరు–5	10,000–13,200
273	10,000–13,000
341	10,000–14,700

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,500
నంబరు–5	10,000–13,500
341	11,000–15,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,500
బాడిగ–355	10,000 – 13,500
దేవనూరు డీలక్స్	10,000 – 13,300
ఆర్మూర్	9,800 – 11,500
తాలుకాయలు	6,000 – 7,400

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,500
బాడిగ – 355	10,000–13,300
దేవనూరు డీలక్స్	10,500–13,200
తాలు	5,300 – 7,200

–కొరిటెపాడు (గుంటూరు)

అమరావతిలో సూపర్‌వైజరీ కమిటీ పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న అమన్‌దీప్ గార్గ్ తదితరులు

తాడికొండ: రాజధాని అమరావతిలో కేంద్ర పర్యావరణం, అటవీ– వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ అమన్‌దీప్ గార్గ్ తదితరులు గురువారం పర్యటించారు. తొలుత ఉండవల్లిలోని రివర్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్, కొండవీటి వాగు వరద పంపింగ్ స్టేషనును పరిశీలించారు. సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్‌లు ఇక్కడి ఏర్పాట్లను ఆయనకు వివరించారు. సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) ఆధ్వర్యంలో అమరావతిలో వరద నిర్వహణ చర్యల నిమిత్తం ప్రస్తుతం అమలవుతున్న, అలాగే భవిష్యత్తులో చేపట్టనున్న కార్యకలాపాలు, ప్రణాళికలపై సూపర్‌వైజరీ కమిటీ తరపున విచ్చేసిన అమన్‌దీప్ గార్గ్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. అనంతరం అమరావతి సీడ్ యాక్సిస్ రహదారి సమీపంలోని ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణం, గ్రీనరీ, ఎల్పీఎస్ జోన్ల అభివృద్ధి పనుల వివరాలను సీఆర్‌డీఏ కమిషనర్ వివరించారు. అనంతరం అధికారులతో కలసి అమన్‌దీప్ గార్గ్ అమరావతిలోని టిడ్కో గృహ సముదాయాలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికారుల కోసం నిర్మించిన భవనాల సముదాయాలను సందర్శించారు. నిర్మాణాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలోని ట్రాన్స్‌లొకేటెడ్ నర్సరీని అమన్‌దీప్ గార్గ్ సందర్శించారు. అనంతరం అమరావతి సచివాలయంలో సూపర్‌వైజరీ కమిటీతో సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు సమావేశమయ్యారు. కమిటీ సభ్యులలోని మరొక ముగ్గురు అధికారులు ఆన్‌లైన్ ద్వారా ఈ సమావేశానికి హాజరు అయ్యారు. రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న భవనాల పనులలో పురోగతి, రాజధాని ప్రాంత నివాసితులకు అమలవుతున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణకు చేపట్టిన కార్యకలాపాలు, కార్మికులు, మహిళల భద్రతకు అమలవుతున్న చర్యల గురించి సీఆర్‌డీఏ అధికారులు వారికి వివరించారు. సమావేశంలో ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి, వివిధ విభాగాల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠతిపాఠి, చిత్రంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు రేంజ్ ఐజీ ఆదేశం

నగరంపాలెం: పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేయాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠతిపాఠి ఆదేశించారు. గుంటూరు పశ్చిమ పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం ఆయన వార్షిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయ రికార్డులు, కేసు డైరీలు, క్రైమ్ రిజిస్టర్, పెండింగ్ కేసుల ఫైల్స్, పెండింగ్ దర్యాప్తుల పురోగతి, నిందితుల అరెస్టులు, కోర్టు హాజరు స్థితిగతులను పరిశీలించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ.. నేర నిరోధక చర్యలను మరింత వేగవంతంగా చేపట్టాలని అన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. నిందితులకు త్వరగా న్యాయస్థానాల్లో శిక్షలు అమలయ్యేలా విధులు నిర్వర్తించాలని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ల కార్యకలాపాలలో పారదర్శకత చూపాలన్నారు. క్రమ శిక్షణ, సంక్షేమంపై దృష్టిసారించి, సమస్యలను పరిష్కరించాలని అన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, పశ్చిమ సబ్ డివిజన్ డీఎస్పీ అరవింద్, పట్టాభిపురం, అరండల్‌పేట, నగరంపాలెం పీఎస్‌ల సీఐలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

వెంచర్‌లో డస్ట్ అన్‌లోడ్ చేస్తుండగా ఘటన





ప్రమాదానికి కారణమైన విద్యుత్ తీగెలు

తాడికొండ: హై టెన్షన్ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందిన ఘటన తాడికొండ అడ్డరోడ్డులో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం... తాడికొండ అడ్డరోడ్డులోని ఓ ప్రైవేటు వెంచర్‌లో బెంజ్ లారీ నుంచి డస్ట్ అన్‌లోడ్ చేసేందుకు పైనున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు తప్పించబోయాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్ తగిలినట్లు సమాచారం. ఘటనా స్థలంలోనే కార్మికుడు కుప్పకూలడంతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై ఇప్పటి వరకు పోలీస్‌స్టేషన్‌కు ఎలాంటి సమాచారం అందలేదు.

పొగాకు పంటకు ప్రత్యామ్నాయం అపరాలు

ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల



మాట్లాడుతున్న ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల

అద్దంకి: పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు సాగు చేసుకోవాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయనిర్మల సూచించారు. 'ఆత్మ' ప్రకాశం జిల్లా సౌజన్యంతో కొంగపాడులో వివిధ పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేయాలని సూచించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మురళీధర్ నాయక్ మాట్లాడుతూ మినుము, కంది, పెసర, శనగ పంటల సాగు, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.ఉష మాట్లాడుతూ అపరాల పంటలో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని.. రసం పీల్చే పురుగుల నివారణ కోసం విత్తన శుద్ధి చేయాలని సూచించారు. ఉప్పునీటి యాజమాన్యం శాస్త్రవేత్త కె. మృదుల మాట్లాడుతూ అపరాలు.. మొక్కజొన్నలో కలుపు నివారణ చర్యలు గురించి తెలియజేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బి.ఎఫ్రాయిం మాట్లాడుతూ కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం బర్లీ పొగాకు సాగు చేయవద్దని సూచించారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ–పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ రామిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయిబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, మణికేశ్వరం సొసైటీ అధ్యక్షుడు నర్రా బ్రహ్మానందం, గుడిపూడి బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రిస్కిల్ల, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.